# కేసీఆర్ పాలనలో మైనారిటీలకు స్వర్ణయుగం



ముస్లిం నాయకులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

### ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, సెప్టెంబర్30: కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో మైనారిటీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, కేసీఆర్ పాలన మైనారిటీలకు స్వర్ణయుగం లాంటిదని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆర్మూర్ ముస్లిం మత పెద్దలు, మర్కజ్ కమిటీ అధ్యక్షులు, మైనారిటీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ... పేద మైనారిటీలకు షాదీ ముబారక్ కింద రూ.లక్షా116, మహిళలకు కుట్టు మిషన్లు, రూ. లక్ష రుణాలు అందజేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్, మాక్లూర్, ఆర్మూర్‌లో కమ్యూనిటీ హాళ్లు, షాదీఖానాలకు భూమిని, నిధులు కేటాయించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు మైనారిటీలకు అందనున్నాయన్నారు. మైనారిటీలు బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పండిత్ వినితా పవన్, వైస్ చైర్మన్ షేక్ మున్న, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సమీర్ హైమద్, ఆర్మూర్ మర్కజ్ కమిటీ అధ్యక్షుడు మొహినుద్దీన్, పెర్కిట్ అధ్యక్షుడు కుదుబొద్దీన్, మామిడిపల్లి అధ్యక్షుడు ఇక్బాల్, ఇంతియాజ్, ఫయాజ్, ఉమన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంజయ్‌సింగ్ బబ్లూ పాల్గొన్నారు.

# నెరవేరనున్న 'ఎత్తిపోతల' కల

- మూడు గ్రామాల్లో 3474 ఎకరాలకు అందనున్న సాగునీరు
- లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు నేడు మంత్రి ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన

బాల్కొండ, సెప్టెంబర్ 30: 70 ఏండ్లలో జరగని అభివృద్ధిని నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి 9 ఏండ్లలో చేసి చూపుతున్నారు. ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న మండలంలోని చిట్టాపూర్, శ్రీరాంపూర్, బాల్కొండ గ్రామాల ప్రజల ఎత్తిపోతల పథకం కల త్వరలో నెరవేనున్నది. ఈ గ్రామాలకు సాగునీరందించేందుకు రూ.149 కోట్ల 6లక్షలతో చిట్టాపూర్ వద్ద నిర్మించనున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు ఆదివారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే చిట్టాపూర్ గ్రామంలో 1952 ఎకరాలు, బాల్కొండ గ్రామంలో 1240 ఎకరాలు, శ్రీరాంపూర్‌లో 280 ఎకరాలకు నీరందనున్నది. రెండు పంటలకు సరిపడా నీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### మంత్రి ప్రశాంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం



మా గ్రామంలో పంటలు పండాలంటే వర్షం నీళ్లే ఆధారం. చెరువులు లేవు. లిఫ్ట్ నిర్మిస్తే మా గ్రామానికి సాగునీరు అందుతుంది. లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

**-పి.గంగాధర్, శ్రీరాంపూర్**

### ప్రశాంత్‌రెడ్డి మంత్రిగా ఉండడం మా అదృష్టం



చిట్టాపూర్‌లో లిఫ్ట్ నిర్మిస్తే బాల్కొండలోని దాదాపు 1240 ఎకరాలకు సాగునీరందుతుంది. రెండు పంటలు పుష్కలంగా పండించుకోవచ్చు. ప్రశాంత్‌రెడ్డి మంత్రిగా ఉండడం మా అదృష్టం.

**- తోట గంగాకిషన్, రైతు, బాల్కొండ**

### కష్టాలు తొలగిపోతాయి



గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా మా కల నెరవేరలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. రైతులకు సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారు. చిట్టాపూర్‌లో లిఫ్ట్ నిర్మిస్తే రైతుల కష్టాలు తొలగిపోతాయి.

**-న్యావనంది సాయన్న, రైతు చిట్టాపూర్**

# నేడు మంత్రి వేముల పర్యటన

కమ్మర్‌పల్లి, సెప్టెంబర్ 30: రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం బాల్కొండ నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఉదయం 9 గంటలకు బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో రూ.149 కోట్లతో బాల్కొండ, చిట్టాపూర్, సుర్బిర్యాల్ లిఫ్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 10 గంటలక వేల్పూర్ మండలం లక్కోర ఏఎన్‌జీ ఫంక్షన్ హాల్‌లో ముస్లింల మసీదుల అభివృద్ధి కోసం నిధుల మంజూరు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మోర్తాడ్ మండలం గాండ్లపేట్‌లో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలో పాల్గొంటారు. సాయంత్రం 4.15 గంటలకు మోర్తాడ్ మండలం పాలెంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ కార్యాలయం, రూ.60 లక్షలతో పాలెం-తిమ్మాపూర్ రోడ్డు పై స్లాబ్ కల్వర్టు, రూ.1.60 కోట్లతో పాలెం-ధర్మోరా బీటీ రోడ్డు, రూ.2 కోట్లతో పాలెం నుంచి ఏర్గట్ల వయా ఎల్లమ్మ దేవాలయం వద్ద రోడ్డుపై మైనర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. రూ.1.55 కోట్లతో తిమ్మాపూర్ నుంచి కమ్మర్‌పల్లి రోడ్డు ప్రత్యేక మరమ్మతులు, రూ.1.75 కోట్లతో తిమ్మాపూర్ నుంచి ఉప్లూర్ బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6 గంటలకు మోర్తాడ్‌లో అభివృద్ధి కార్యక్రమల్లో పాల్గొంటారు. రూ.1.50 కోట్లతో స్లాబ్ కల్వర్టు నిర్మాణం, రూ.1.48 కోట్లతో మోర్తాడ్ హైవేపై పాలెం ఎక్స్ రోడ్డు నుంచి పెట్రోల్ పంపు వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పొడిగింపు, రూ.40 లక్షలతో మోర్తాడ్ భీమ్‌గల్ రోడ్డుపై స్లాబ్ కల్వర్టు, రూ.3.25 కోట్లతో తక్కూరి వాడ పెద్ద వాగుపైలో లెవెల్ కాజ్ వే, రూ.50 లక్షలతో ప్రజా కల్యాణ మండపం పనులకు శంకుస్థాపన చేస్తారు. రాత్రి 7 గంటలకు మోర్తాడ్ మండలం సుంకెట్‌లో రూ.3.20 కోట్లతో సుంకెట్-వెంకటాపూర్ అభివృద్ధి పనులు, రూ.3.45 కోట్లతో సుంకెట్ వెంకటాపూర్ రోడ్డు పెద్ద వాగుపై రోడ్ డ్యామ్, రూ.60 లక్షలతో సుంకెట్ మోర్తాడ్ రోడ్డుపై స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# ఆరోగ్య తెలంగాణ సాధనకు సీఎం కేసీఆర్ కృషి

### హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్



వేల్పూర్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ మధుశేఖర్

వేల్పూర్, సెప్టెంబర్30: రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. వేల్పూర్ ఎక్స్‌రోడ్డులో స్పైసెస్ పార్క్‌లో రూ.39లక్షలతో నిర్మిస్తున్న పసుపు యూనిట్ పనులకు, రూ.20లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం పనులు, అమీనాపూర్ నుంచి లక్కోర వరకు రూ.82లక్షలతో బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు, వేల్పూర్ నుంచి భీమ్‌గల్ వెళ్లే దారిలో రూ.కోటి 90లక్షలతో మైనర్ బ్రిడ్జి పనులు, వేల్పూర్‌లో రూ.20లక్షలతో హెల్త్ సబ్ సెంటర్ పనులకు డాక్టర్ మధుశేఖర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, ప్రభుత్వ వైద్యుడు అశోక్, ఎంపీపీ భీమ జమున, జడ్పీటీసీ అల్లకొండ భారతి, వేల్పూర్ సర్పంచ్ తీగల రాధ, మోహన్, ఉపసర్పంచ్ పిట్ల సత్యం, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగధర్, ఆర్టీఏ సభ్యుడు రేగుల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి గ్రామంలో మౌలిక వసతులు**

మోర్తాడ్, సెప్టెంబర్30: దొన్కల్‌లో రూ.1.30కోట్లతో రోడ్డు, వంతెన నిర్మాణం, ధర్మోరాలో రూ.1.50కోట్లతో ధర్మోరా-వన్నెల్ బీటీ రోడ్డు పనులు, రూ.1.20కోట్లతో ధర్మోరా-పాలెం బీటీరోడ్డు పనులకు రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జడ్పీటీసీ బద్దం రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పాపాయిపవన్, రాష్ట్ర విత్తన కమిటీ సభ్యుడు సంజీవ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సర్పంచులు కత్తి లావణ్యా ముత్తెన్న, మండల రాజేశ్వర్, ఎంపీటీసీలు అశోక్, లావణ్యా సుధాకర్, శ్రీనివాస్, సత్యనారాయణ, పోశన్న, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తాటిపల్లి శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' పనులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ఏర్గట్ల, సెప్టెంబర్ 30: ఉపాధిహామీ పనులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో చందర్‌నాయక్ హెచ్చరించారు. ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. 25వ సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల వివరాలను ప్రజావేదికలో చదివి వినిపించారు. పనుల్లో జరిగిన లోపాలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్డీవో మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరగకుండా సంబంధిత అధికారుల చూడాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, డీవీవో నారాయణ, ఎంపీడీవో కర్నె రాజేశ్, పీఎం అశోక్, ఎస్టీఎం దత్తు, సామాజిక తనిఖీ అధికారులు మహేశ్, ఏపీవో వెంకటేశ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## టెంట్ హౌస్ ఏర్పాటుకు రుణాలు

కమ్మర్‌పల్లి, సెప్టెంబర్ 30: మహిళా సంఘాల సభ్యులు నూతనంగా టెంట్ హౌస్ వ్యాపారం ప్రారంభించుకోవడానికి సెర్ప్ ఐకేపీ ద్వారా న్యూ ఎంటర్ ప్రైజెస్ పథకం కింద రుణం అందించనున్నట్లు ఏపీఎం కుంట గంగాధర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఐకేపీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

## గెజిగెడ్ హెచ్‌ఎంలకు సన్మానం

ఆర్మూర్, సెప్టెంబర్30: ఆర్మూర్, ఆలూర్ మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలలకు ఇటీవల బదిలీపై వచ్చిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను శనివారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో రాజగంగారామ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



సాలూరలో మాట్లాడుతున్న చైర్మన్ జనార్దన్

బోధన్ రూరల్/రెంజల్, నవీపేట, సెప్టెంబర్ 30: సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను శనివారం సొసైటీ చైర్మన్ అల్లే జనార్దన్ అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి బస్వంత్ రావుపటేల్ సొసైటీకి సంబంధించిన ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సొసైటీ డైరెక్టర్లు, ఎంపీటీసీ కండెల సవిత, శివాలయం చైర్మన్ శంకర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.రెంజల్ మండలం నీలా సహకార సంఘంలో చైర్మన్ ఇమ్రాన్‌బేగ్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రాఘవేందర్‌యాదవ్, డైరెక్టర్లు, సీఈవో రాందాస్ తదితరులు పాల్గొన్నారు. నవీపేట మండలం ఫత్తేనగర్ భూములకు గతంలో మాదిరిగా పంట రుణాలు ఇచ్చేందుకు నవీపేట మహాజన సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. నవీపేట విండో మహాజన సభ చైర్మన్ న్యాలకంటి అబ్బన్న అధ్యక్షతన నిర్వహించారు. కార్యదర్శి మహేశ్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. బినోలాలో విండో సభను చైర్మన్ మగ్గరి హన్మాండ్లు అధ్యక్షతన నిర్వహించారు. రైతుల సమక్షంలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు దొంత ప్రవీణ్‌కుమార్, బాబర్, విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.

## స్వామినాథన్‌కు సంతాపం

నందిపేట్, సెప్టెంబర్ 30: వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ సంతాప సభ స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ గంగన్న, సిలిండర్, లింగం, బాలగంగాధర్, దేవన్న, లక్కంపల్లి చిన్నయ్య, మారంపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.



యంచ వద్ద గోదావరి నదిలో వినాయక నిమజ్జనం ..

## మూడో రోజు కొనసాగిన గణేశ్ నిమజ్జనం

నవీపేట/మోర్తాడ్,సెప్టెంబర్ 30: నవీపేట మండలంలోని యంచ గోదావరి నదిలో శనివారం మూడో రోజు గణేశ్ నిమజ్జన కార్యక్రమం కొనసాగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భారీ విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిజామాబాద్ సీఐ సతీశ్ ఆధ్వర్యంలో ఎస్సై యాదగిరిగౌడ్, రెవెన్యూ అధికారులతో వివిధ శాఖల అధికారులు పర్యవేక్షించారు. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లో 12 యువజనసంఘాల సభ్యులు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లారు.



తిమ్మాపూర్‌లో వినాయక శోభాయాత్ర..